క్లుప్తంగా

సైబర్ నేరాల నివారణపై అవగాహన అవసరం


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీకాంత్

గోకవరం: విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ సూచించారు. గోకవరంలో రాజాపబ్లిక్ స్కూల్ 45వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో డీఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళా రక్షక్ సేవలు, గంజాయి, సైబర్‌క్రైం, మైనర్ డ్రైవింగ్‌పై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం చదువుతో పాటు ఆటపాటల్లో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పట్నాల సూర్యప్రకాష్‌రావు, ప్రిన్సిపల్ రమానాగలక్ష్మి, గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయం వద్ద అన్నదానం


భక్తులకు వడ్డిస్తున్న మహిళలు

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం గ్రామ శివారున వేంచేసిన కనకదుర్గమ్మ ఆలయం వద్ద శనివారం భారీ అన్నదానం నిర్వహించారు. అమ్మవారి ఆలయ 33వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ పెద్దలు, భక్తుల సహకారంతో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కృష్ణునిపాలెంతో పాటు కొత్తూరు, చిన్నూరు, రామన్నపాలెం తదితర గ్రామాల భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెంలో వైఆర్సీ కాలువ గట్టుపై ఆదివారం రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నట్టు శనివారం నిర్వాహకులు తెలిపారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో నిర్వహించే ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా పలు ఎడ్ల జతలు పాల్గొంటాయని చెప్పారు. స్థానిక, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

రేపు లక్ష్మీనారాయణస్వామి దివ్య కల్యాణోత్సవం


లక్ష్మీనారాయణస్వామి, అమ్మవారు

తుని రూరల్: టి.తిమ్మాపురం శివారు విష్ణుపురం మహావిష్ణు ఆలయంలో కొలువైన లక్ష్మీనారాయణ స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణోత్సవం ఈ నెల 10న నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు పోల్నాటి శేషగిరిరావు శనివారం తెలిపారు. సోమవారం సాయంత్రం ఐదు గంటలకు మేళతాళాలు, కోలాట నృత్యాలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగిస్తామన్నారు. 6 గంటలకు వార్షిక దివ్య కల్యాణాన్ని నిర్వహిస్తామన్నారు. దివ్య కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు.

విధిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి


సోమవరం గ్రామ సచివాలయంలో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదును పరిశీలిస్తున్న ఏఓ

కిర్లంపూడి: మండలంలోని సొంతపాలెం కలిగిన ప్రతి రైతూ ఫార్మర్ రిజిస్ట్రీ విధిగా చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి జోకా అమృత సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు ఆధార్ తరహాలో ఒక యూనిక్ ఐడీ కేటాయిస్తారన్నారు. రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, పథకాలు ఈ యూనిక్ ఐడీ ద్వారానే ఇస్తారన్నారు. ఇప్పటికే మండలంలో 7261 మంది రైతులు యూనిక్ ఐడీ నమోదు చేసుకున్నారన్నారు. ఇంకా 1100 మంది రైతులు చేయించుకోవాల్సి ఉందన్నారు. ఇప్పటివరకూ నమోదు చేయించుకోని రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ లింక్ అయిన మొబైల్ నంబర్ తీసుకెళ్లి ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని సూచించారు.


శంఖవరం కేజీబీవీలో మహిళను సన్మానిస్తున్న సిబ్బంది


గోకవరంలో సర్పంచ్ కొమరం శ్రావణి, కార్యదర్శి శిరీషలను సన్మానిస్తున్న పంచాయతీ సిబ్బంది


ఏలేశ్వరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు


ప్రత్తిపాడులో డాక్టర్ సౌమ్యమైఖేల్‌ను సత్కరిస్తున్న ఎస్ఎంఎస్ సంస్థ సభ్యులు

నారి.. చైతన్యఝరి

- వైభవంగా ప్రపంచ మహిళా దినోత్సవం
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, సమావేశాలు
- అతివలకు సత్కారం

ఏలేశ్వరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో గ్రామాల్లో ర్యాలీలు, సమావేశాలు జరిగాయి. సీపీఐ (ఎంఎల్) ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏలేశ్వరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకురాలు గండేటి పెద నాగమణి మాట్లాడుతూ దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. రాజకీయపరంగా మహిళలకు సమన్యాయం కల్పించాలన్నారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్, గుమ్మడి పాదాలమ్మ, కందుల వరలక్ష్మి, గూనాపు వరలక్ష్మి, కందుల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూదినారాయణస్వామి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మహిళా సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వాగు రాజేష్, కౌన్సిలర్ యండగండి నాగబాబు, బుగతా శ్రీను తదితరులు పాల్గొన్నారు.


తునిలో ప్రదర్శనలు ఇచ్చిన చిన్నారులతో ఎమ్మెల్యే యనమల దివ్య

సమాజంలో మహిళలకు ప్రత్యేక స్థానం

ప్రత్తిపాడు: స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలోని బార్ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ లీలా శ్యామ్‌సుందరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం మెజిస్ట్రేట్ లీలా శ్యామ్ సుందరితో పాటు మహిళా న్యాయవాదులు, కోర్టు మహిళా సిబ్బందిని బార్ ప్రతినిధులు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. స్థానిక బజారు వీధి రామాలయం ఆవరణలో సదా మీ సేవలో (ఎస్ఎంఎస్) సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరిటెండెంట్ డాక్టర్ బి.సౌమ్యమైఖేల్‌ను సత్కరించారు. సంస్థ ఫౌండర్, చైర్మన్ శ్రీసాయి జ్యూలయరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి, సంస్థ ప్రతినిధులు సత్యానందం, సలాది కృష్ణ, భేరి రాంబాబు, ఏలూరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ సభ్యుడు ధరణాల కోట శ్రీను ఆధ్వర్యాన మహిళలకు మిఠాయిలు పంచారు. మండలంలోని లంపకలోవలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ అనుబంధ సంస్థ అఖిల భారత ప్రగతిశీలా మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు.

మహిళా సాధికారతే ధ్యేయం

తుని రూరల్: మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. తుని మండలం తేటగుంట క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రజా దర్బారు నిర్వహించిన ఎమ్మెల్యే యనమల దివ్యను పలువురు మహిళలు కలిశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. రాపాక, కుమ్మరిలోవ, వి.కొత్తూరు, తేటగుంట, తదితర గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

గండేపల్లి: సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించినట్టు కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు తెలిపారు. గ్లోబల్ ఎంగేజ్‌మెంట్-టెక్ అలయన్స్ సీనియర్ మేనేజర్ లోకేష్ మెహ్రా, కస్టమర్ సక్సెస్, ఇన్నర్మేటికా అసోసియేట్ డైరెక్టర్ విష్ణుప్రియ కృష్ణమూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, తదితరులు పాల్గొన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శనివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ మహిళా సిబ్బందిని శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్ ఎస్.రమాశ్రీ తదితరులు పాల్గొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్సై యువి శివ నాగబాబు, మాజీ వైస్ ఎంపీపీ పోతుల మోహన్‌రావు తదితరులు మహిళా పోలీసులకు స్వీట్లు పంపిణీ చేసి, బహుమతులు అందజేశారు.

గోకవరం: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కొమరం శ్రావణి, కార్యదర్శి బొర్రు శిరీష ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగతో పాటు మండలంలోని మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ ఢిల్లీలో మహిళా సాధికారతపై నిర్వహించిన జాతీయ స్థాయి వర్క్‌షాపులో పాల్గొనే అవకాశం దక్కించుకున్న సర్పంచ్ శ్రావణి, కార్యదర్శి శిరీషలను ఎంపీపీ శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, మండల పరిషత్ కార్యాలయం, పంచాయతీ సిబ్బంది ఘనంగా సత్కరించారు. అలాగే ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లను పంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఈటీసీ వేణుగోపాల్‌తో పాటు ఎంపీడీఓ గోవిందు, అధిక సంఖ్యలో మహిళా ఉద్యోగులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


రాజపూడి పీహెచ్‌సీలో కేక్ కట్ చేస్తున్న డాక్టర్లు, సిబ్బంది

జగ్గంపేట: మండలంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ ప్రణీత్, రాజపూడి పీహెచ్‌సీలో డాక్టర్ శ్రీరామ్ ఆధ్వర్యంలో మహిళా డాక్టర్లు, సిబ్బందిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ చెన్నారావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ పులి ప్రసాద్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులు, ఉద్యోగులను సత్కరించారు.ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం షాదీఖానాలో మహిళా సదస్సు ఏర్పాటు చేశారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయుల, ప్రగతి శీల మహిళా సంఘం పెద్దాపురం డివిజన్ అధ్యక్షురాలు కె.లక్ష్మి ప్రసంగించారు. మహిళా చట్టాలను సక్రమంగా అమలు చేయాలని కోరారు.

ఉన్నత స్థానాలకు ఎదగాలి

శంఖవరం: మహిళలు అన్నిరంగాల్లో ముందుండి ఉన్నత స్థానాలను అధిరోహించాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ బాలామణి అన్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో శనివారం ప్రపంచ మహిళా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ బాలామణి, మహిళా అధ్యాపకులను విద్యార్థినులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. విద్యార్థినులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ప్రిన్సిపాల్ సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి ఎంఎల్‌హెచ్‌పీ రత్నశ్రీ, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

తుని: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే యనమల దివ్య సూచించారు. స్థానిక శతమానం భవతి కల్యాణ మండలంలో శనివారం జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బాలికలు ఇచ్చిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమంతోనే సుస్థిరాభివృద్ధి


ఏవీ నగరంలో సభలో మాట్లాడుతున్న గ్రామ సర్పంచ్ కొయ్యా జగదీశ్వరి

తొండంగి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడం ద్వారా సుస్థిరాభివృద్ధి సాధ్యమని ఏవీ నగరం గ్రామసర్పంచ్ కొయ్యా జగదీశ్వరి, సామర్లకోట ఈటీసీ శిక్షణ కేంద్రం పరిశీలకురాలు డీఆర్ఎస్ పద్మజ అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళాదినోత్సవం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీలుగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఒక్కో గ్రామపంచాయతీని ఎంపిక చేయగా కాకినాడ జిల్లాలో ఏవీ నగరం పంచాయతీని ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో ఏవీ నగరంలో సర్పంచ్ కొయ్యా జగదీశ్వరిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వైద్యం, ఆరోగ్య పరిరక్షణ, మహిళల ఆర్థిక స్వావలంబన తదితర అంశాలపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. మహి ళాదినోత్సవం సందర్భంగా ఫ్రంట్‌లైన్ వర్కర్స్ ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యురాలు పి.భారతి, గ్రామ నాయకులు యనమల నాగేశ్వరరావు, యనమల కృష్ణ, యనమల పెదబాబు, ఎంపీటీసీ యనమల సూర్యారావు, పంచాయతీ కార్యదర్శి ఈగల శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన


సింహాద్రిపురంలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్

కిర్లంపూడి: రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా పంచాయతీరాజ్ సూపరింటిండెంట్ ఇంజినీరింగ్ అధికారి ఏవీ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని సింహాద్రిపురం రోడ్డుకు రూ. 1.25 కోట్లు, భూపాలపట్నం-వీరవరం రోడ్డుకు రూ.75 లక్షలు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. కాగా శనివారం ఆయన పనులను పరిశీలించి కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఈ ఉమాశంఖర్, ఏఈ వెంకటనారాయణ, కాంట్రాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ


ప్రత్తిపాడులో పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న ఎస్ఎంఎస్ ప్రతినిధులు

ప్రత్తిపాడు: సమాజ సేవలో ప్రజలు భాగస్వాములు కావాలని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సూపరింటిండెంట్ డాక్టర్ బి.సౌమ్యమైఖేల్ పిలుపునిచ్చారు. స్థానిక బజారు వీధి రామాలయ ఆవరణలో శనివారం సదా మీ సేవలో (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైతే నేరుగా తనను సంప్రదించాలన్నారు. ఎస్ఎంఎస్ వంటి సంస్థల ద్వారా అందుతున్న చేయూతను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు భోజన, పౌష్టికాహార కిట్లను శ్రీసాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి సమకూర్చారు. కార్యక్రమంలో మండల ఫొటోగ్రాఫర్స్ యూనియన్, మండల టైలర్స్ యూనియన్ అధ్యక్షులు సలాది కష్ణ, ఏలూరి వెంకటరమణ, సంస్థ ప్రతినిధులు గొందేసి సత్యానందం, భేరి రాంబాబు, జె జగదీశ్వరి, ఎస్ లోవకుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కార వేదిక లోక్ అదాలత్

- ప్రత్తిపాడు కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి లీలా శ్యామసుందరి
- జాతీయ లోక్ అదాలత్‌లో 243 కేసుల పరిష్కారం



ప్రత్తిపాడు కోర్టులో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి లీలా శ్యామసుందరి

ప్రత్తిపాడు: కేసుల సత్వర పరిష్కార వేదిక లోక్ అదాలత్ అని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి లీలా శ్యామసుందరి అన్నారు. స్థానిక కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి లీలా శ్యామ సుందర్ మాట్లాడుతూ కక్షిదారులు కేసుల పరిష్కారం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతూ ధనం, విలువైన సమయాన్ని కోల్పోతున్నారన్నారు. కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకుంటే కక్షిదారులు ఇరువురూ కేసు గెలిచినట్టేనని చెప్పారు. ఇకనైనా కక్షిదారులు లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ బెంచ్ మెంబర్ బుగత శివ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భారీగా కేసుల పరిష్కారం

ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో అత్యధికంగా 243 కేసులను పరిష్కరించారు. ప్రభుత్వానికి చలానా రూపంలో రూ. 7,13,936 జమ చేశారు. 131 నేరం కేసులను పరిష్కరించడం ద్వారా రూ.2,45,350, 61 ఎక్సైజ్ కేసులను పరిష్కరించడం ద్వారా రూ. 4,68,586 ప్రభుత్వానికి చెల్లించారు. ఒక మనోవర్తి కేసులో రూ.2 లక్షలు, గృహహింస కేసులో రూ.2 లక్షలు చెల్లించాలంటూ తీర్పు నిచ్చారు. ఐదు సివిల్ కేసుల్లో రూ.8.76 లక్షలు, బ్యాంకు రుణం ఎగవేత కేసులో రూ.80 వేలు, బీఎస్ఎన్ఎల్‌కు రూ.1,030 చెల్లించాలంటూ న్యాయమూర్తి లీలా శ్యామసుందరి తన తీర్పులో వెల్లడించారు.

పరీక్షలకు 26 మంది గైర్హాజరు

కిర్లంపూడి: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. కిర్లంపూడి ప్రభుత్వ, జగపతినగరం ప్రగతి జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఫస్టియర్ మ్యాథ్స్, జ్యువాలజీ, హిస్టరీ పరీక్షలకు 738 మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా 712 మంది హాజరయ్యారు. 26 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్టు సీఎస్‌లు పలివేల శివాజీ, జె.కాంచనమాల తెలిపారు.

పంచారామ క్షేత్రంలో పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో ఫాల్గుణ నవమిని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సెలవు దినం కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు దేవస్థాన అన్నదాన ట్రస్టు నుంచి అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు.


కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల రిలే దీక్షలు


ఏలేశ్వరంలో ఆర్టీసీ ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న వినోద్ మిశ్రా పార్టీ శ్రేణులు

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డ్రైవర్‌ను అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ పట్టణంలో ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో గేట్ వద్ద ఉద్యోగులు ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన ఎస్వీ రమణను 1/2009 సర్క్యులర్‌కు విరుద్ధంగా అక్రమంగా సస్పెండ్ చేశారన్నారు. ఉద్యోగులు ధర్నాలు చేస్తున్న యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమం చేస్తామన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ సంఘీభావం తెలిపింది. వినోద్ మిశ్రా శ్రేణులు ఉద్యోగుల దీక్ష శిబిరానికి చేరుకుని వారికి మద్దతుగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొశిరెడ్డి గణేష్, నాగమణి, ఎన్ఎంయూ డిపో కార్యదర్శి టి.త్రిమూర్తులు, ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి యూబీఎం కుమార్, యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎస్‌పీరావు పాల్గొన్నారు.

మంచు కురిసే.. మది మురిసే..


మంచుతెర ముసుగులో లేత ఎరుపు రంగుతో ప్రకాశిస్తున్న సత్యదేవుని ఆలయం


మంచుతెరలను చీల్చుకుంటూ ఉదయించిన సూర్యభగవానుడు


పంపా నదిని కప్పేసిన మంచుదుప్పటి

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయాన్ని ప్రతిరోజూ తెల్లవారుజామున పొగమంచు కమ్మేస్తోంది. గోపురాలకు గల లేత ఎరుపు రంగు విద్యుత్ దీపాల వెలుగులు మంచును చీల్చుతూ ప్రకాశించడంతో శనివారం ఉదయం స్వామివారి ఆలయం మరింత ఆకర్షణీయంగా దర్శనమిచ్చింది. సాధారణంగా రాత్రి వేళల్లో సత్యదేవుని ఆలయం తెలుపు రంగులోనూ, గోపురాలు లేత ఎరుపు విద్యుత్ దీపాల వెలుగులోనూ దర్శనమిస్తాయి. కాగా శనివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు స్వామివారి ఆలయం పొగమంచు కారణంగా లేత ఎరుపు రంగుతో దర్శనమిచ్చింది. ప్రకాష్‌సదన్ సత్రం మీద గల శంఖుచక్రనామాలు మంచుతెర కారణంగా అస్పష్టంగా కనిపించాయి. పంపా నదిని మంచుతెర కప్పేయడంతో నదిలో నీటికి బదులు తెల్లని మంచు దర్శనమిచ్చింది. ఉదయం 6.30 గంటలకు భానుడు మంచుతెరలను చీల్చుకుంటూ ఉదయించడం కనువిందు చేసింది.

పాఠశాలకు రక్షణ కరవు



రాజుపేటలో పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో తాత్కాలిక రక్షణగా ఏర్పాటు చేసిన గ్రీన్ షేడ్ నెట్

తుని రూరల్: మండలంలోని రాజుపేటలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రక్షణ కరువైంది. ఈ స్కూల్‌లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు 100 మందికిపైగా ఉన్నారు. పాఠశాల ప్రాంగణం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన రహదారికి పక్కనే స్కూల్ ఉండడంతో వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము చేరుతుంది. పాఠశాల సమయంలో తరచూ కుక్కలు చొరబడి విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నాయి. దీంతో ప్రహరీ స్థానంలో తాత్కాలికంగా గ్రీన్ షేడ్ నెట్ (బరకం)ను ఏర్పాటు చేశారు. కుక్కలు రాత్రి వేళల్లో పాఠశాలలో స్థావరం ఏర్పాటు చేసుకుని నిద్రిస్తున్నాయి. సెలవు దినాల్లో కొంతమంది ఆకతాయిలు అష్టాచమ్మా, పేకాట వంటి జూదాలకు నిలయంగా మార్చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఘనంగా మందిరాల వార్షికోత్సవం

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో జ్ఞానసరస్వతీ దేవి, షిర్డీ సాయి బాబా మందిరాల వార్షికోత్సవాలు శనివారంతో ముగిశాయి. రెండు రోజుల పాటు సరస్వతీ దేవి, షిర్డీ సాయి బాబాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యూనివర్సిటీ చాన్సలర్ ఎన్.శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతులతో పురోహితులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేయించారు. విద్యార్థులు, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.